క్లుప్తంగా

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



కోనేటమ్మపల్లిలో మినీ ఫిష్ ఆంధ్ర దుకాణాన్ని ప్రారంభించిన ఎంపీపీ

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో మత్స్యకారుల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కోనేటమ్మ పల్లి గ్రామంలో మంగళవారం మినీ ఫిష్ ఆంధ్ర దుకాణాన్ని ఆయన ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న మినీ పిష్ ఆంధ్ర పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా దుకాణాలను ఏర్పాటు చేసి మత్స్యకారులకు ఉపాధి కల్పించారన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చ్చార్జ్ ఓంకార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పబ్బతి రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న ఆర్టీసీ డీఎం మహేంద్రుడు

ఆత్మకూరు:పట్టణంలోని ఏపీఎస్సార్‌టీసీ డిపో ఆవరణలో మంగళవారం ఆర్టీసీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను ఆర్టీసీ డీఎం మహేంద్రు డు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తమ డిపో పరిధిలో అత్యధిక డీజిల్ పొదుపు, అత్యధిక ఆదాయం తెచ్చిన డ్రైవర్, కండక్టర్లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. అత్యధిక డీజిల్ పొదుపు చేసిన డ్రైవర్లు సి.శ్రీనివాస రెడ్డి,అహ్మద్, రజాక్, అత్యధిక ఆదాయం తెచ్చిన కండెక్టర్లు సుబ్బలక్ష్మి, రమణ, రామలింగారెడ్డి, చెన్నయ్య, ప్రతాప్‌లకు ప్రోత్సాహక బహుమతులు,ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఐకోటయ్య, కంట్రోల్ తిమ్మయ్య, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇంటిగ్రేట్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్ ప్రారంభం

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్ ఇంటిగ్రేట్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే శిల్పాచక్రపాణి రెడ్డి గురువారం ప్రారంభిస్తారని ఏడీఏ ఆంజనేయులు మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఈ నెల 8వ తేదీన ల్యాబ్‌ను ప్రారంభించాల్సి ఉండగా కొన్ని కారణాల వలన వాయిదా పడిందన్నారు. గురువారం సాయంత్రం ఈ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి మండలంలోని రైతులు ,మండల వ్యవసాయ సలహా సంఘం సభ్యులు తదితరులు హాజరుకావాలని చెప్పారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

పగిడ్యాల: మండలంలోని కొత్త ముచ్చుమర్రి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ మద్దిలేటి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షలు నిధులు మంజూరు చేయించడం వలన ఎస్సీ కాలనీలో కొదవగా ఉన్న మెటల్ రోడ్డును కవర్ చేస్తున్నామని మాజీ సర్పంచ్ వెల్లడించారు. భూమిపూజ కార్యక్రమంలో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ చంద్ర, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తదితరులు ఉన్నారు.

మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయండి

నందికొట్కూరు: ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన జరిగే మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా కార్యక్రమానికి స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మెగా జాబ్ మేళా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీటెక్, టెక్నికల్ కోర్స్ చదువుకున్న యువతీ, యువకులు అర్హులన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ సునీత, టౌన్ సీఐ విజయభాస్కర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మేకల దాదా గంధోత్సవం

పగిడ్యాల: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో వెలసిన హజరత్‌సయ్యద్‌షా అబ్దుల్‌ఖాదర్ ఖాద్రి (మేకలదాదా) 27వ గంధోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు హైదరాబాదుకు చెందిన సయ్యద్ హఫీజ్ హుసేన్ ఖాద్రి, మహమ్మద్ జజీరుల్లా ఖాద్రి హాజరై భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు సమర్పించారు. సాయంత్రం మేళతాళాలతో గంధాన్ని ఊరేగించి మేకలదాదాకు గంధం ఎక్కించారు. ప్రజలు సుఖసంతోషాలు, పాడిపంటలతో వర్ధిల్లాలని దువా చేశారు.

పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలపై నిరసన

- ఆత్మకూరులో వలంటీర్ల ధర్నా
- పట్టణంలో ర్యాలీ



ఆత్మకూరు తహసీల్దార్ ఉమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

ఆత్మకూరు: జన సేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ వలంటీర్లకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆత్మకూరు వలంటీర్ల సంఘం అసోసియేషన్ నాయకులు అరీఫ్, శ్వేత, అల్లిషేర్, షేక్షా అన్నారు. పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వలంటీర్లు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యం ఏర్పాటు దిశలో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేసి, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సినీ నటుడు పవన్‌కల్యాణ్ నోటికి వచ్చినట్లుగా వలంటీర్లను దూషించడం సరికాదన్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజల వద్దకు వెళ్లి వలంటీర్ల అందించిన సేవలు మరువలేనివన్నారు.

వలంటీర్ల ధర్నా, ర్యాలీ :

ఆత్మకూరు పట్టణంలో జనసేన అధినేత, సినీ నటుడు పవన్‌కల్యాణ్ వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలకు నిరసన గా పట్టణంలోని నంద్యాలటర్నింగ్ నుంచి గౌడ్‌సెంటర్, కొత్తబస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా చేపట్టి తహసీల్దార్ ఉమాదేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్ల సంఘం నాయకులు నాగేశ్వరి, రాధమ్మ, సంధ్యమ్మ, మరియమ్మ, హసీనా తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకో..

జూపాడుబంగ్లా: పవన్‌కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకోవాలని మండలంలోని పోతులపాడు గ్రామ వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివానందరెడ్డి హెచ్చరించారు. పవన్‌కల్యాణ్ వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం పోతులపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శివానందరెడ్డి అధ్వర్యంలో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతూ గ్రామంలో ఊరేగించారు. అనంతరం దిష్టిబొమ్మకు నిప్పుపెట్టి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు అంకన్న, కవిత, మంజుల,చిన్నబాబు, సుధారాణి, అజూష, వైఎస్సార్సీపీ నాయకుడు శివానందరెడ్డి మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ రాజకీయ గుర్తింపు కోసం వలంటీర్లపై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేదిలేదన్నారు. ఆయన అనుచిత మాటలను ఉపసంహరించుకొని వెంటనే క్షమాపణలు చెప్పాలని, లేని ఎడల ఆయన యాత్రను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రభుదాసు, విష్ణు, వజ్జిల్లి, కలాం తదితరులు పాల్గొన్నారు. పవన్‌కళ్యాణ్ మాటలపై జూపాడుబంగ్లా సచివాలయం వద్ద వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. వెంటనే పవన్ తన మాటలను ఉపసంహరించుకొని వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



పోతులపాడులో పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



జూపాడుబంగ్లా గ్రామసచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు

- జగనన్న సురక్ష కార్యక్రమం సద్వినియోగం చేసుకోండి
- సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సేవలు భేష్
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



ఆత్మకూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని కురుకుంద, ఆత్మకూరు పట్టణంలోని 15, 20, 21 , 22 వార్డుల పరిధిలోని అర్బన్‌కాలనీ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 99 శాతం హామీలు నెరవేర్చామని ఒక్క శాతం హామీలు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. వీటిలో కూడ 11 ఉచిత సేవలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. కుల, నివాస, జనన , మరణాలు, భూమి కొనుగోలు, వివాహధృవీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు, కౌలు గుర్తింపు కార్డులు, రేషన్‌కార్డులు వలంటివి అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందుతున్నాయని, తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని చెప్పారు. అనంతరం రైతులకు వరి, మినుము విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్ మీర్, రాజమోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, మున్సిపల్‌చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, ఎంపీపీ తిరుపాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

పట్టణంలోని అర్బన్‌కాలనీ సచివాలయం వద్ద 678 మంది దరఖాస్తు చేసుకోగా 672 మందికి సంబంధించిన సమస్యలకు పరిష్కారం చూపారు. శిల్పా భువనేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, ఎంపీపీ లాలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దదేవలాపురంలో ఎమ్మెల్యేకు థ్యాంక్స్ చెబుతున్న లబ్ధిదారుడు వెంకటేశ్వర్లు

ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని నీటిముంపు నిరుద్యోగులు దుశ్శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నీటిముంపునిరుద్యోగ సంఘం నాయకులు చెన్నకేశవులు మాట్లాడుతూ తమకు నెలకు రూ10 వేల నుంచి 20 వేలు వేతనాలు పెరిగాయని, ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి సన్మానిస్తున్నట్లు చెప్పారు.

దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న సచివాలయ వ్యవస్థ

వెలుగోడు: ముఖ్యమంత్రి వైయస్ జగన్ తీసుకు వచ్చిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. మోత్కూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధి దారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. గ్రామంలో

పేదలకు రక్ష జగనన్న సురక్ష

మహానంది: బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు. నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డితో కలిసి గ్రామంలో 363 మందికి పత్రాలు అందించారు. జెడ్పీటీసీ బారెడ్డి రామతులశమ్మ, ఎంపీపీ సంజీవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ముడిమెల పుల్లారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ విక్రమసింహానాయక్, సొసైటీ చైర్మన్ శివలింగం, ఎస్సీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహానంది: మండలంలోని అబ్బీపురం గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై 522 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ శవ్వా శ్రీలక్ష్మి, ఎంపీటీసీ పిట్టల సునీత, వ్యవసాయ సలహామండలి చైర్మన్ శవ్వా శరభారెడ్డి, మండల నాయకులు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో లబ్ధిదారుల్లో సంతోషం

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



దామగట్లలో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

నందికొట్కూరు రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని నియోజకవర్గ ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దామగట్ల గ్రామంలో అధికారులు, నాయకులు జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆర్థర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీల మేరకు పార్టీలకతీతంగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తూ ప్రజలను ఆర్థికంగా ఆదుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమైన ధ్రువపత్రాలను అధికారులు, వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామ సర్పంచ్ మాధవరం సుశీలమ్మతో కలిసి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, మండల ఇన్‌చ్చార్జ్ ఓంకార్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఏసురత్నం, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎంపీడీవో శోభారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవరం రత్నం, వేల్పుల నాగన్న, పబ్బతి రవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమం దేశంలోనే గొప్పది

నందికొట్కూరు: జగనన్న సురక్ష కార్యక్రమం దేశంలోనే గొప్పదని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలో జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైనవారిలో ఏ ఒక్కరూ మిగిలిపోకుండా అర్హులందరికీ ఆయా పథకాల ద్వారా లబ్ధి చేకూర్చే లక్ష్యంతోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, మేనేజర్ మంజునాథ్‌గౌడు, కౌన్సిలర్లు రవూఫ్, అశోక్, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అబుబక్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రక్ష

పగిడ్యాల:మండల పరిధిలోని లక్ష్మాపురం 2 సచివాలయం పరిధిలోని పడమర ప్రాతకోట సంతమార్కెట్ సమీపాన వైస్ ఎంపీపీ శ్యామలమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న 419 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ భారతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గుజ్జుల రమేష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు రమణ, కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా, నాయకులు కురువ మల్లయ్య, రమణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తంగడంచ గ్రామంలో సర్పంచ్ ఈదుల ఈశ్వరరెడ్డి అధ్యక్షతన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పాల్గొన్నారు. గ్రామంలో 714 మంది దరఖాస్తులు చేసుకోగా 708 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సువర్ణమ్మ, తహసీల్దార్ పుల్లయ్య యాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ, వైస్ ఎంపీపీలు రవణమ్మ, కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ముఖ్య అతితిగా హాజరయ్యారు. 300 మందికి వివిధ ధ్రువ పత్రాలు అందజేశారు.



మహిళకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



కొత్తపల్లిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న ఆర్డీఓ దాసు

కార్యక్రమంలో ఆర్డీఓ దాసు, తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ గోపీకృష్ణ, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు నాయుడు, కో ఆప్టెడ్ ముర్తుజావలి, జేఎస్‌సీ కన్వీనర్ రమణారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు చౌడయ్య, రఘురామిరెడ్డి,మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలకేంద్రంలోని సచివాలయం వద్ద ఎంపీడీఓ మేరి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి హాజరై లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమాన్ని ఆత్మకూరు ఆర్డీఓ దాసు ఆకస్మిక తనిఖీ చేశారు. లబ్ధిదారులకు సరైన ధ్రువపత్రాలు ఇస్తున్నారా లేదా అని ఆరాతీశారు. గ్రామంలో 149 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, సర్పంచు లక్ష్మీదేవి, ఎంపీటీసీ అలీబాషా తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: మండలపరిధిలోని తిమ్మాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్ బాబు హాజరయ్యారు. సర్పంచ్ నాగస్వామి రెడ్డి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

కరోనాకు భయపడకుండా..

ఇతని పేరు ఆరీఫ్, ఆత్మకూరులోని గరీబ్‌నగర్‌లో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతను ప్రతి నెల ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందించేవాడు. గతంలో కరోనా మహమ్మారి వ్యాపించిన సమయంలో ప్రజలు.ఇంటి నుంచి బయటికి వెళ్లాలన్నా, ఇతరుల ఇంటికి వెళ్లాలన్నా భయపడే పరిస్థితి ఉండేది. అయినా ఆరిఫ్ కరోనాను సైతం లెక్కచేయకుండా ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేసి వృద్ధుల దీవెనలు పొందాడు. వృద్ధుల కుటుంబసభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటూ. అవసరమైన మందులు అందజేస్తూ తోడుగా నిలిచాడు.



కరోనా సమయంలో ముర్తుజాబీ ఇంటి వద్ద యోగ క్షేమాలు తెలుసుకుంటున్న వలంటీర్ ఆరీఫ్

ఆప్యాయంగా పలకరింపు



మా వలంటరీ ఆరీఫ్ ప్రతినెలా 1వ తేదీ వచ్చిందంటే చాలు తెల్లవారక ముందే ఇళ్ల వద్దకు వచ్చి అవ్వా అంటూ నిద్రలేపి, ఆప్యాయంగా పలకరించి నవ్వుతూ ఫింఛన్ ఇచ్చి వెళ్తాడు. కరోనా సమయంలోనూ భయపడకుండా మా ఇంటి వద్దకు వచ్చి పింఛన్ అందిచాడు. అంతేకాకుండా నా ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తగిన సూచనలు ఇచ్చేవాడు.

. - ముర్తుజాబీ, గరీబ్‌నగర్, ఆత్మకూరు.

కుటుంబసభ్యుడిలా సేవలు..

ఇతని పేరు ఖలిలుల్లా, ఆత్మకూరు పెద్దపీర్లవీధిలో వలంటీర్‌గా సేవలందిస్తున్నాడు. కరోనా సమయంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఫించన్ పంపిణీ చేశాడు. తనకు కేటాయించిన ఇళ్ళు వెళ్లి కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా జ్వరం ఉందా, అస్వస్తతకు గురయ్యారా అని అడుగుతూ వారికి ధైర్యం చెప్పేవాడు. వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేయిస్తూ, ఆప్యాయంగా పలకరిస్తూ ఏమి కావాలన్నా సమకూర్చేవాడు. మందులు, కూరగాయలు, నిత్యావసర సరుకులు తెచ్చి ఇచ్చేవాడు. ఫించన్ ఇచ్చే సమయంలో కుటుంబసభ్యులకు మనో ధైర్యాన్ని అందించేవాడు.



కరోనా సమయంలో వైద్య సిబ్బందితో కలిసి ముర్తుజా ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న వలంటీర్ ఖలీలుల్లా

ఖలీలుల్లా సేవలు మర్చిపోలేను.



కరోనా సమయంలో మా వలంటీర్ ఖలీలుల్లా సేవలు ఇప్పటి వరకు మర్చిపోలేకపోతున్నా. ఫించన్ ఇచ్చినప్పుడల్లా ఇళ్లవద్దకు వచ్చి కరోనా సమయంలో తాత మాత్రలు తీసుకో... పింఛన్ డబ్బులు జాగ్రత్త అంటూ చెప్పేవాడు. మాయదారి కరోన ఇంటి వారిని సైతం నమ్మకుండా ఉన్న సమయంలో కరోనా సమయంలో వలంటీరు మా ఇంటి వద్దకు వచ్చి మందులు , కూరగాయలు ఇచ్చాడు. - ముర్తుజా, పెద్దపీర్లవీధి, ఆత్మకూరు.

గర్భంతో ఉన్నా.. ప్రజాసేవలో..

జూపాడుబంగ్లా మండలంలోని భాస్కరాపురం గ్రామంలో సుభాషిణి గత నాలుగేళ్ల నుంచి వలంటీరుగా విధులు నిర్వహిస్తోంది. ఈమె పరిధిలో ఉన్న 54 ఇళ్లల్లో నిబంధనలను అనుసరించి, అర్హతను బట్టి ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందేలా చేస్తోంది. కరోనా సమయంలో ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తూ వలంటీరుగా విధులు నిర్వహించింది. అంతేకాదు తాను గర్భిణిగా ఉన్నప్పటికీ గ్రామప్రజలకు పింఛన్లు పంపిణీతో పాటు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను ఎప్పటికప్పుడు వివరిస్తూ వారిలో అర్హులైన వారందరికీ అందేలా చేస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంది.



గర్భిణిగా ఉన్న వలంటీరు సుభాషిణి తెల్లవారకముందే పింఛన్లు పంచుతూ...

ఓపికతో సేవలందిస్తోంది



నాకు 75ఏళ్లు. నేను వయోభారంతో నడవలేక మంచానికి పరిమితం అయ్యాను. నాకు వృద్ధాప్య పింఛన్ వస్తుంది. ప్రతి నెల తెల్లవారకముందే వలంటీరు సుభాషిణి ఇంటివద్దకు వచ్చి ఒక్కో సారి నా వేలిముద్ర పడకపోయినా ఓపికతో నాతో వేలిముద్ర వేయించుకొని పింఛన్ సొమ్ము నాచేతిలో పెడుతుంది. కరోనా సమయంలోనూ పింఛన్ అందించింది. - మద్దూరు లింగమ్మ, భాస్కరాపురం


డెంగీని తరిమి కొడదాం



కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంనుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి:ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా పరిసరాల శుభ్రతను పాటించి డెంగీ వ్యాధిని తరిమి కొడదామని వైద్యులు వినోద్‌కుమార్, దీపానాగవేణి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కొత్తపల్లి గ్రామంలో డెంగీ నివారణ మాసోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ డెంగీ వ్యాధి అనేది దోమల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. పడుకునే సమయంలో దోమతెరలు వాడడం, దోమకాటుకు గురికాకుండా పొడవాటి చేతుల చొక్కా, ప్యాంటు ధరించాలని సూచించారు. అనంతరం గ్రామంలో డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

మహానంది: బండిఆత్మకూరు మండలంలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన ఉపాధి పనులపై బుధవారం నుంచి సామాజిక తనిఖీ కార్యక్రమం ఉంటుందని ఏపీఓ వసుధ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందాల సభ్యులు గ్రామాల్లో పనులు, రికార్డులు పరిశీలిస్తారని చెప్పారు. సమావేశంలో ఏఓ హనీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణుల ఆకలి తీర్చడంలో తృప్తి

నందికొట్కూరు: వైద్య పరీక్షల కోసం వచ్చే గర్భిణుల ఆకలి తీర్చడం ఎంతో తృప్తినిస్తుందని డాక్టర్ ఏఎస్ రాయుడు అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్ష కోసం వచ్చిన గర్భిణులకు జవ్వాజి సువకన్న గౌడ్ సేవా సమితి ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో జవ్వాజి సుంకన్నగౌడు సేవా సమితి అధ్యక్షులు శ్రీకాంత్‌గౌడు, తదితరులు పాల్గొన్నారు.

రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించండి

మిడుతూరు: మండలంలో భూ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆత్మకూరు ఆర్‌డీఓ దాసు అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లతో భూ- సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. . తప్పులకు తావులేకుండా, ఆక్రమాలకు పాలప్పడకుండా సర్వే చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షానవాజ్, మండల సర్వేయర్ కృష్ణుడు, ఆర్ఐ మహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

మహానంది: బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామంలో బుధవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 7గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారని, రామాపురం లోనూ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.